క్లుప్తంగా

మరమ్మతులు వేగవంతం చేయండి

బొబ్బిలి: మండలంలోని పారాది వంతెన వద్ద గడ్డర్ వంగి కొద్దిపాటి రహదారి బ్రిడ్జిపై కుంగిన నేపథ్యంలో చేపడుతున్న మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేసి వాహన రాకపోకలకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులతో శనివారం ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ.. కార్లు, ఆటోలే కాకుండా బస్సులకు కూడా అనుమతులు ఇచ్చి రెండు రాష్ట్రాల మధ్య ప్రయాణ సంబంధాలు మెరుగుపరచాలని కోరారు. మరోపక్క వంతెన కింద మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి. పనులను ఈఈ జీవీ రమణ, డీఈఈ, ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షిస్తున్నారు.

సేవాభావాన్ని అలవర్చుకోవాలి

రేగిడి: ప్రతీ ఒక్కరు సేవాభావాన్ని అలవర్చుకోవాలని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర ఆధ్యాత్మిక సమన్వయకర్త పడాల ప్రసాదరావు అన్నారు. మండల కేంద్రం రేగిడిలోని విశ్వసాయి మందిరంలో శనివారం భగవాన్ శ్రీసత్యసాయిబాబా ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు సేవా కార్యక్రమాలు, వాటి ఫలితాలు, నామ సంకీర్తన, నగర సంకీర్తన వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా ప్రశాంతి సేవా నిలయం ఇన్‌చార్జ్ శ్రీనివాసరావు, భజన మండలి కన్వీనర్ లావేటి విష్ణుమూర్తి, మామిడి శివప్రసాద్, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: పట్టణంలోని 19వ వార్డులో గల బల్లవీధిలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు శనివారం శంకుస్థాపన చేశారు. రూ.5 లక్షల వ్యయంతో 110 మీటర్ల సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పనులు త్వరితగతిన పూర్తిచేసి రోడ్డును ప్రజా వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైస్ చైర్మన్లు చెలికాని మురళి, రమాదేవి, కమిషనర్ ఎస్. శ్రీనివాసరావు, వార్డు ఇన్‌చార్జ్ వాసంతి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

తీరిన తాగునీటి కష్టాలు

రేగిడి: మండలంలోని మజ్జిరాముడుపేట, అప్పాపురం, బుడితిపేట, ఉనుకూరు, సోమరాజుపేట, వప్పంగి తదితర గ్రామాల్లో ప్రజలకు తాగునీటి కష్టాలు తీరాయి. జలజీవన్ మిషన్ పనుల్లో భాగంగా ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో తాగునీటి కోసం ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయడంతో పాటు పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా చేస్తుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మిగిలిన గ్రామాల్లో కూడా జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు చేపట్టనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.శ్రీచరణ్ తెలిపారు.

రైతులంతా ఈకేవైసీ చేయించుకోవాలి

రాజాం సిటీ: మండలంలోని రైతులంతా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారి ఎం.రేణుకాసాయి అన్నారు. మండలంలోని వీఆర్ అగ్రహారంలో చేపడుతున్న ఈకేవైసీ ప్రక్రియను శనివారం ఆమె పరిశీలించారు. ఈ నెల 9తో ఈకేవైసీ చేయించేందుకు గడువు ముగుస్తున్నందున ఇప్పటివరకు ఈకేవైసీ చేయించుకోని రైతులు వెంటనే ఆర్‌బీకేలకు వెళ్లి వీఏఏలను సంప్రదించాలని సూచించారు. రైతులు పంటల వివరాలతో కూడిన ధ్రువీకరణ పత్రం పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరి అని తెలిపారు.

కౌన్సెలింగ్

బొబ్బిలి: సారా కేసుల్లో పట్టుబడిన 17 మంది పాత నిందితులకు ఎస్ఈబీ సర్కిల్ కార్యాలయంలో సీహెచ్‌సీ వైద్యులు కృష్ణకుమార్, తదితరులు శనివారం అవగాహన కల్పించారు. సారా విక్రయాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ ఆర్. జైభీమ్, న్యాయవాది తుమరాడ గంగాధర్, తదితరులున్నారు.

వీణల తయారీ కేంద్రాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్

బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లిలో గల వీణల కేంద్రాన్ని ట్రైనీ కలెక్టర్ త్రివినాథ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రం ఇన్‌చార్జ్ వెంకటరావు, కార్మికులతో మాట్లాడారు. వీణల తయారీకి కలప ఎక్కడ నుంచి తీసుకువస్తున్నారు... ఒక వీణ తయారు చేయడానికి ఎన్ని రోజులు పడుతుంది.. ఇతర సమస్యలపై ఆరా తీశారు.

ఆరోగ్యమే మహాభాగ్యం..


బాడంగి మండలం భీమవరంలో వైద్యశిబిరానికి హాజరైన రోగులు

ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా వలంటీర్లు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. అనంతరం సచివాలయ పరిధిలో వైద్యశిబిరాలు నిర్వహించి అవసమైన వారికి నిష్ణాతులైన వైద్యులచే సేవలందిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం పలుచోట్ల వైద్య శిబిరాలు నిర్వహించగా... వందలాది మంది ప్రజలు వైద్యసేవలు పొందారు.
– బొబ్బిలి/రాజాం నెట్‌వర్క్


బొబ్బిలి: పెంట గ్రామంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు


తెర్లాం: పణుకువలసలో రోగులను తనిఖీ చేస్తున్న వైద్య సిబ్బంది


రామభద్రపురం: సోంపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మందులు అందజేస్తున్న సిబ్బంది


రాజాం: అంతకాపల్లిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే కంబాల జోగులు


సంతకవిటి: మంతినలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వృద్ధురాలికి మందుల కిట్టు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగులు


రేగిడి: కందిశలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి ఎ.కళ్యాణచక్రవర్తి


మెంటాడ: జక్కువలో రోగులను స్వయంగా తనిఖీ చేస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం

● నందబలగ, నందిగాం గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించిన ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అహర్నిషలు కష్టపడి పనిచేస్తున్నారని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని నందబలగ, నందిగాం గ్రామాల్లో రూ.43 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోట్లాది రూపాయలతో ఆస్పత్రులను ఆధునీకరించడం, గ్రామాల్లో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించి ప్రజలకు సొంత గ్రామాల్లోనే వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ప్రజలంతా సచివాలయాల పరిధిలో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లను సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. గత ప్రభుత్వంలో విద్య, వైద్యం రంగాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ఆరోగ్యశ్రీ పథకాన్ని గత ప్రభుత్వం పూర్తిగా నీరుగార్చిందని ఆరోపించారు. జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆరోగ్యశ్రీ రూపురేఖలు మార్చి పూర్తి స్థాయిలో బలోపేతం చేసి అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రతి పీహెచ్‌సీకి 108, 104 వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత ఆయనదేనన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించి ప్రజలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. అటువంటి నాయకుడ్ని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెర్లాం ఎంపీపీ ప్రతినిధి ఎస్.బాబ్జీరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు టి.సత్యంనాయుడు, మాజీ ఎంపీపీ రామినాయుడు, నందబలగ, నందిగాం సర్పంచ్‌లు పైడితల్లి, గంగ, నందిగాం ఎంపీటీసీ సభ్యురాలు గౌరి, నందబలగ ఉప సర్పంచ్ జి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, పీఆర్ డీఈ అప్పారావు, ఏఈ రాజశేఖరరావు, తదితరులు పాల్గొన్నారు.


నందిగాంలో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించిన బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

● ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామచంద్రపురం, కొత్తూరు గ్రామాల్లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్నప్పటికీ ఎవరికైనా పథకాలు అందకపోతే తెలియజేయాలని కోరారు. ఈ ప్రభుత్వంలో అందరికీ సమన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీలను 99 శాతంపైగా అమలు చేశారని గుర్తుచేశారు. సంక్షేమపాలన చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. చంద్రబాబు మోసపూరిత మేనిఫెస్టోతో ప్రజలను మరోసారి మభ్యపెట్టేందుకు సిద్ధమవుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్ ను ఆశీర్వదించి మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పండు రాజగోపాల్, వైస్ ఎంపీపీ పండు పాపారావు, మాజీ సర్పంచ్ పండు వెంకట కృష్ణారావు, వైస్ సర్పంచ్ చొక్కర ప్రసాదరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామినాయుడు, మాజీ వైస్ ఎంపీపీ జి.కేసరి, జేసీఎస్ కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


రామచంద్రపురంలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

గ్రామాభివృద్ధికి సహకరించాలి

● బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు

తెర్లాం: గ్రామాన్ని మరింత అభివృద్ధిపథంలో నడిపించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రతిఒక్కరూ సహకరించాలని బొబ్బిలి ఏఎంసీ చైర్మన్, కూనాయవలస ఎంపీటీసీ సభ్యుడు బొమ్మి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని కూనాయవలస గ్రామ సచివాలయంలో సర్పంచ్ బోడెల విజయబాబు అధ్యక్షతన శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, గ్రామస్తులంతా ఐకమత్యంతో ఏకతాటిపై ఉన్నప్పుడే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయవచ్చన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాల ద్వారా ప్రజల ఆర్థికాభివృద్ధి మెరుగుపడిందన్నారు. సర్పంచ్ బోడెల విజయబాబు మాట్లాడుతూ, గ్రామాన్ని మండలంలోనే అత్యుత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి ఎంఏ స్వామి గ్రామంలో ఇంతవరకు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టబోయే పనుల గుర్తింపుపై చర్చించారు. పంచాయతీకి వచ్చిన ఆదాయ వనరులు, జమ, ఖర్చులు తెలియజేశారు. గ్రామసభలో పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, పక్కన సర్పంచ్ విజయబాబు

బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలి..

బొబ్బిలి: పార్టీ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. రామభద్రపురం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా నూతనంగా ఎంపికైన అప్పికొండ లక్ష్మునాయుడు ఎమ్మెల్యే శంబంగిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి, ఆయన సోదరుడు వేణుగోపాలనాయుడులను సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నిర్మల, చినబాబు, ఏక్‌నాథ్, కొట్టక్కి గ్రామానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

● వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లక్ష్మునాయుడు


ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లక్ష్మునాయుడు

రామభద్రపురం: పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు అన్నారు. మండల అధ్యక్ష పదవి వరించిన నేపథ్యంలో శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, తదితరులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లక్ష్మునాయుడు మాట్లాడుతూ, మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. 2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామభద్రపురం పాల సొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, జెడ్పీటీసీ ప్రతినిధి అప్పికొండ నిర్మల, పీఏసీఎస్ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్, నాయకులు కోట రమణ, పత్తిగుళ్ల ఏక్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధుల నివారణే లక్ష్యం

● పశు సంవర్ధకశాఖ ఎ.డి విష్ణు

రామభద్రపురం: పాడి పశువులలో గర్భకోశ వ్యాధుల నివారణతో పాటు పాల ఉత్పత్తి పెంపే ప్రభుత్వం లక్ష్యమని పశు సంవర్ధక శాఖ ఎ.డి ఎల్. విష్ణు అన్నారు. పశుధన్ జాగృతి అభియాన్ కార్యక్రమంలో బాగంగా జిల్లా పశు సంవర్ధశాఖ సహకారంతో గరివిడి పశు వైద్య కళాశాల ఆధ్వర్యంలో మండలంలోని నాయుడువలసలో ఈ నెల 12న మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో స్థానిక పశువైద్యశాలలో ఎ.డి విష్ణును గరివిడి పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ నక్కా శ్రీను నేతృత్వంలో కళాశాల ప్రొఫెసర్స్ బృందం శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఎ.డి విష్ణు మాట్లాడుతూ, మెగా వైద్య శిబిరంలో నిష్ణాతులైన పశువైద్యులు సేవలందిస్తారని తెలిపారు. పశువులకు సాధారణ వైద్య పరీక్షలు, పశువులలో పునరుత్పత్తి సమస్యలు, శస్త్రచికిత్సలు, రక్త, మల పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పశు సంరక్షణ, పశువులను ఏ విధంగా సాకాలి, పాల ఉత్పత్తి పెంపు, పశువులకు సోకే వ్యాధులు – తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తారని తెలిపారు. అలాగే గొర్రెలు, మేకల పెంపకంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరిస్తారని చెప్పారు. మెగా వైద్యశిబిరానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి హాజరవుతారని తెలిపారు. అనంతరం నాయుడువలసలో పశువులను పరిశీలించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి హిరణ్య పాల్గొన్నారు.


గరివిడి పశువైద్య కళాశాల ప్రొఫెసర్లతో మాట్లాడుతున్న పశు సంవర్ధక శాఖ ఎ.డి విష్ణు

విగ్రహాలు ధ్వంసం చేయడం దారుణం

బొబ్బిలి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను సమర్థవంతంగా సంక్షేమం దిశగా నడిపించిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఉత్తరావిల్లి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని మెట్టవలసలో ధ్వంసం చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలసి శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విగ్రహ ధ్వంసం అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు. దుండగులను త్వరగా పట్టుకుని అరెస్ట్ చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు, ఎస్‌పీ రాజు, కనిమెరక సత్యం, మీసాల శ్రీనివాసరావు తదితరులున్నారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం

బొబ్బిలి: పట్టణంలోని ప్రేమ్‌నగర్ కాలనీ పక్కనే ఉన్న 4.71 ఎకరాల ప్రభుత్వ భూమిని శనివారం స్వాధీనం చేసుకున్నట్టు తహసీల్దార్ డోల రాజేశ్వరరావు తెలిపారు. ఆర్‌ఐ కళ్యాణచక్రవర్తి తన సిబ్బందితో కలసి శనివారం వెళ్లి సర్వే నంబరు 218–ఏలో ఉన్న ఈ భూమిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ భూమి 1961లో ప్రేమ్‌నగర్ కాలనీ పట్టాల కోసం 12.60 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందన్నారు. అందులో ఉన్న ఖాళీ ప్రదేశాన్ని గుర్తించిన అధికార యంత్రాంగం భవిష్యత్తు అవసరాల కోసం స్వాధీనం చేసుకుని అక్కడ బోర్డులు పాతారు. ఈ భూమిని ఆక్రమించినా మరే ఇతర కార్యకలాపాలు నిర్వహించినా శిక్షార్హులవుతారని నోటీసులో పేర్కొన్నారు.


ప్రభుత్వ స్థలంలో బోర్డు పాతిన ఆర్‌ఐ కల్యాణ చక్రవర్తి, సిబ్బంది

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి

● తహసీల్దార్ రత్నకుమార్

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కార్యకర్తలంతా అవగాహన కల్పించాలని తహసీల్దార్ డి.రత్నకుమార్ అన్నారు. మండలంలోని పణుకువలసలో శనివారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. స్టాల్‌ను పరిశీలించిన తహసీల్దార్ రత్నకుమార్ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారవుతారని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పెరుమాళి సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి, పణుకువలస సర్పంచ్ చందక సత్యనారాయణ, గోపాలవలస సర్పంచ్ ప్రతినిధి గొందాల వెంకటరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ రత్నకుమార్

పత్ర కషాయంతో చీడపీడల నివారణ


రాజాం: ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగంగా వివిధ రకాల పత్రాలతో చేసిన కషాయాన్ని పిచికారీ చేయడం ద్వారా పంటలకు వ్యాపించే చీడపీడల ఉధృతిని నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం ఎస్ఎఫ్ఏ రేఖ, మాస్టర్ ట్రైనీ కిరణ్ అన్నారు. మండలంలో కొఠారిపురం గ్రామంలో శనివారం పలువురు మహిళా రైతులకు పత్ర ద్రావణాల తయారీపై అవగాహన కల్పించారు. వేప, కానుగ, ఉమ్మెత్త, జిల్లేడు, మారేడు, వెదురు, వావిలాకు, రావి, మందార, కలబంద, తూటికాడ ఆకులు, తులసి, అత్తాకోడల్లాకు, వెంపలాకులతో కషాయాన్ని ఏవిధంగా తయారు చేయాలో వివరించారు. 150 లీటర్ల పత్ర ద్రావణాన్ని తయారీచేసి రైతుల సమక్షంలో పంటలకు పిచికారీ చేశారు. ద్రావణం మొక్కల ఎదుగదలకు, శిలీంధ్ర నాసినిగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్‌వన్ పి.రమాదేవి, ఐసీఆర్‌పీలు టి.అరుణ, లక్ష్మి, కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

రాజాం సిటీ: స్థానిక ఎస్సీ హరిజనవీధికి చెందిన దిలీప్, ఆళప వీధికి చెందిన రాముతో పాటు మరో ఇద్దరు కలిసి తనపై దాడిచేసి గాయపరచారని మల్లికార్జునకాలనీకి చెందిన కింతలి మురళి శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై పి.నీలావతి తెలిపిన వివరాల మేరకు.. మురళీకృష్ణ చీపురుపల్లి రోడ్డులో ఈ నెల 6న టిఫిన్ చేస్తుండగా సదరు నలుగురు వ్యక్తులు అక్కడకు వచ్చి కొండక వీధికి చెందిన శ్రీనివాసరావుకు డబ్బులు ఎందుకు ఇవ్వవు అని మురళీకృష్ణను అడిగారు. తాను అతనికి బాకీలేనని చెప్పినా వినకుండా తన ఫోన్‌ను లాక్కుని పాడుచేయడంతో పాటు తనను కొట్టి గాయపరచడంతో రాజాం ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

దివ్యాంగులపై చిన్నచూపు తగదు

● సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు


దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు

రాజాం సిటీ: మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వారిపట్ల చిన్న చూపు తగదని రాజాం సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు అన్నారు. ఈ నెల 10న ప్రపంచ మానసిక దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బదిరుల పాఠశాలలో శనివారం న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల హక్కులు, వారిపట్ల కుటుంబ సభ్యుల బాధ్యతలను న్యాయమూర్తి వివరించారు. మానసిక దివ్యాంగులను ఆదరించాలని, చట్టపరమైన సమస్యలు ఎదురైతే న్యాయసేవా సంస్థలను ఆశ్రయించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయి తేజ, న్యాయవాదులు డి.భవానీప్రసాద్, ఆర్.విజయ్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు, ఎస్.మురళి, పాఠశాల డైరెక్టర్ ఎస్.నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో రేగిడి విద్యార్థిని ప్రతిభ

రేగిడి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని డి.విష్ణుప్రియ వ్యాసరచన పోటీల్లో చక్కని ప్రతిభ కనబరిచిందని హెచ్ఎం వావిలపల్లి లక్ష్మణరావు శనివారం తెలిపారు. విశాఖపట్నం రఘు కళాశాలలో జరుగుతున్న వరల్డ్ స్పేస్ వీక్ ప్రోగ్రాంలో భాగంగా మన నిత్య జీవితంలో ఇస్రో పాత్రపై నిర్వహించిన ఈ పోటీలో పాఠశాలకు చెందిన విద్యార్థిని పాల్గొని ఉత్తరాంధ్ర స్థాయిలో ద్వితీయ స్థానం సంపాదించింది. విద్యార్థినిని పాఠశాల హెచ్ఎంతో పాటు ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్య, సైన్సు టీచర్ పి.ఉమామహేశ్వరి అభినందించారు.

రాజాం విద్యార్థుల ప్రతిభ

రాజాం సిటీ: శ్రీహరికోట అంతరిక్ష పరిశోధన సంస్థ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభకనబరిచినట్లు హెచ్ఎం పి.నాగయ్య తెలిపారు. ఈ నెల 6న రఘు ఇంజనీరింగ్ కళాశాలలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లోని 6 నుంచి 12వ తరగతి విద్యార్థులకు 'రోల్ ఆఫ్ ఇస్రో ఇన్ డే టు డే లైఫ్' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు ఎ.తరుణ్, కె.జశ్వంత్‌లు 4, 5 స్థానాలు సాధించినట్లు చెప్పారు.